సాక్షి నిర్మల్

శుక్రవారం । 21 । జూన్ । 2024



జీవన 'యోగ'ం

భారతీయ సనాతన సంస్కృతికి ఎంతో విశిష్టత ఉంది. ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోంది. నేడు ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా యోగా విశిష్టతపై ప్రత్యేక కథనం. 8లో▸



సీఎం దృష్టికి ట్రిపుల్ఐటీ సమస్యలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బాసర ట్రిపుల్ఐటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు గురువారం కలిశారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
33.3 /25.5

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కష్టపడేవారికి గుర్తింపు

• ఎస్పీ జానకీషర్మిల



దత్తురాంకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: పోలీస్ శాఖలో కష్టపడి పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. ఇటీవల జరిగిన 16వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుల్ దత్తురాంకు జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో గురువారం ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దత్తురాం మార్చి 17 నుంచి 22 వరకు హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించిన ఆల్ ఇండియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో కీలక పాత్ర పోషించారన్నారు. అతని కష్టానికి ప్రతిఫలంగా అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ జనరల్ స్టీఫెన్ రవీంద్ర ప్రశంసాపత్రం పంపించినట్లు పేర్కొన్నారు.

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

• బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఏలేటి

నిర్మల్‌చైన్‌గేట్: మొఘల్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన యోధుడు ఛత్రపతి శివాజీ స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. హిందూ సామ్రాజ్య దినోత్సవం(శివాజీ పట్టాభిషేక మహోత్సవం) సందర్భంగా నిర్మల్ శివాజీచౌక్‌లోని శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశభక్తికి, పోరాట స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ నిలుస్తారన్నారు. కార్యక్రమంలో శివాజీ సమితి జిల్లా అధ్యక్షుడు మెడిసెమ్మ రాజు, నాయకులు అంజుకుమార్‌రెడ్డి, భూమయ్య, రాంనాథ్, సత్యనారాయణగౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, అరవింద్ పాల్గొన్నారు.

'నీట్'పై కేంద్రం మౌనం వీడాలి

• సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: నీట్ పరీక్షపై కేంద్ర ప్రభుత్వం మౌనం విడాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలకు నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బస్టాండు ఎదుట గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని, పేపర్ లీకేజీ అంశంలో ఎన్టీఏ, ఉన్నతాధికారుల పాత్రపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పరీక్షలు నిర్వహించే బాధ్యత నుంచి ఎన్టీఏను తప్పించి, ప్రతీ రాష్ట్రం తమకు తామే పరీక్ష నిర్వహించుకునే అవకాశం ఇవ్వాలన్నారు. జిల్లా కమిటీ సభ్యులు శంబు, సీపీఎం పట్టణ కార్యదర్శి ఫసియుద్దీన్, నాయకులు సాయిరెడ్డి, దిగంబర్, సాయి కిరణ్, గంగారాం పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ఆందోళన

నిర్మల్‌చైన్‌గేట్: ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు నీట్ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ లక్షలాది మంది విద్యార్థులు చేస్తున్న నిరసనకు మద్దతుగా నిర్మల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఆందోళన చేయనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పాటకు ప్రాణం పల్లవి అయితే..



సప్తస్వరాలు సంగీత ప్రపంచానికి మూలాధారాలుగా నిలుస్తున్నాయి. కాలాన్ని సైతం మరపించి.. మానసిక ఆనందంతోపాటు ఆరోగ్యాన్ని ప్రసాదించే శక్తి సంగీతం సొంతం జూన్ 21న అంతర్జాతీయ సంగీత దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...

- వివరాలు 8లో▸

దేవుని భూములకు రక్షణ



గుండెగాం గ్రామంలోని బాసర సరస్వతీ ఆలయానికి చెందిన భూములు..

• పట్టాల జారీకి ప్రభుత్వం నిర్ణయం
• జిల్లాలో 108 దేవాలయాలు
• వీటి పరిధిలో సుమారు 1,472.23 ఎకరాలు

నిర్మల్‌చైన్‌గేట్: ఆలయాల భూములకు రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆలయాల పేరిట ఉన్న భూములు చాలాచోట్ల ఆక్రమణకు గురయ్యాయి. అలాంటి వాటిని గుర్తించి భూములను స్వాధీనం చేసుకుని, వివాదాలు పరిష్కరించి పట్టాపాస్ బుక్కులు జారీ చేయనుంది. ఇది త్వరగా పూర్తయితే ఆక్రమణకు గురైన భూములు ఆయా దేవాలయాల పరిధిలోకి రానున్నాయి. వాటిద్వారా వచ్చే ఆదాయంతో ఆలయాలు అభివృద్ధి చెందనున్నాయని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

273 ఆలయాల్లో ధూపదీప నైవేద్యం..

జిల్లాలో మూడు మున్సిపాలిటీలు, 18 మండలాలు ఉన్నాయి. 396 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గ్రామాలు, పట్టణాల్లో ఆదాయం వస్తున్న ఆలయాలు మాత్రమే దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలో ఉన్నాయి. ఇక ఆదాయం రాని సుమారు 273 ఆలయాలకు ధూపదీప నైవేద్యం కింద నెలకు రూ. 10 వేల చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. ఆ డబ్బులతో ఆలయాల్లో నిత్యపూజలు నిర్వహిస్తున్నారు.

1,472.23 ఎకరాల ఆలయ భూములు..

జిల్లాలోని అన్ని గ్రామాల్లో వివిధ ఆలయాలు ఉన్నా.. 108 ఆలయాలకు మాత్రమే భూమి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటి పరిధిలో 1,472.23 ఎకరాలు ఉన్నట్లు తెలుస్తోంది. ధరణి పోర్టల్ రాకముందు ఆలయ భూములన్నీ మిగులు భూములుగా రికార్డుల్లో నమోదు చేశారు. దీంతో కొన్ని ఆలయాల భూములు ఆక్రమణకు గురయ్యాయని భక్తులు అంటున్నారు. అప్పట్లో కొన్ని ఆలయాల భూములు అర్చకుల పేరు మీద ఉండేవి. ధరణి పోర్టల్ వచ్చాక అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలయ భూముల వద్ద బోర్డులు ఏర్పాటు చేయించింది. సమస్య ఉన్న భూములు మాత్రం అలాగే ఉండిపోయాయి. విలువైన భూములు ఆక్రమణకు గురైనా చర్యలు తీసుకోవడంలో ఏళ్ల తరబడి జాప్యం జరగడంతో వాటి గురించి తెలిసిన భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆలయాల భూములకు రక్షణ కల్పించాలని, వాటికి పట్టా పాసుబుక్‌లు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

330.2 ఎకరాలు కౌలుకు..

దేవాలయాల భూములు మొత్తం 1,472.23 ఎకరాలు ఉండగా వాటిలో 330.2 ఎకరాలను ఇతరులకు కౌలుకు ఇచ్చినట్లు ఆశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన ఇంకా 1,342.03 ఎకరాలు పడావు ఉన్నాయి. ఈ భూములను వృథాగా ఉంచకుండా ఎవరికైనా కౌలుకుఇచ్చి ఆ ఆదాయంతో ఆలయాలను అభివృద్ధిచేయాలని భక్తులు కోరుతున్నారు.

వివరాలు:

• భూములు కలిగిన దేవాలయాల సంఖ్య:108
• మొత్తం భూములు 1472.23 ఎకరాలు
• పాస్‌బుక్ ఉన్న భూమి ఎకరాలు 604.19
• పాస్ బుక్ లేని భూమి ఎకరాలు 668.04
• దూపదీప నైవేద్యం పొందుతున్న ఆలయాలు 273
• కౌలుకు ఇచ్చిన భూమి 330.2ఎకరాలు

ప్రభుత్వ పరిశీలనలో ఉంది

ఆలయాల భూములకు పట్టా జారీ చేయాలనే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఆలయాల భూముల విషయంలో ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నాం. పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తాం.

– రవికిషన్, అసిస్టెంట్ కమిషనర్, దేవాదాయ శాఖ

ఆక్రమణదారులపై చర్యలు..



దేవుడి భూములను కబ్జా చేయడం దారుణం. దేవాదాయశాఖ రికార్డుల ప్రకారం భూముల వివరాలు సేకరించాలి. ఆక్రమణకు గురైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం, అధికారులు చొరవ చూపి ఆలయాల భూములను రక్షించాలి.

– కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, నిర్మల్

బడిలో బిజినెస్!

• ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల దందా
• ఏటా రూ.కోట్లలో వ్యాపారం
• తల్లిదండ్రుల జేబులకు చిల్లు..
• చోద్యం చూస్తున్న విద్యాశాఖ..
• అడ్డుకోవాలంటున్న విద్యార్థి సంఘాలు



ఓ ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి పుస్తకాల కిట్

భైంసాటౌన్: ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల దందా యథేచ్ఛగా సాగుతోంది. నర్సరీ, యూకేజీ మొదలు పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులే కాకుండా స్టేషనరీ, యూనిఫాంలు కూడా పాఠశాల ఆవరణలోనే విక్రయిస్తున్నారు. మరికొన్ని పాఠశాలల యాజమాన్యాలు సమీపంలో గదులను అద్దెకు తీసుకుని పుస్తకాల దందా సాగిస్తున్నారు. ఏటా ఇదే తంతు జరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థి సంఘాలు ఆందోళన చేసిన సందర్భాల్లో తనిఖీలు చేసి నామమాత్ర చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఆయా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు షరామామూలే అన్నచందంగా దందా సాగిస్తున్నాయి. నిబంధనల ప్రకారం పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాంలు, స్టేషనరీ విక్రయించవద్దు. కానీ, నో ప్రాఫిట్–నో లాస్ నిబంధన సాకుతో పాఠశాలల ఆవరణలోనే కొన్ని యాజమాన్యాలు తమ పాఠశాలల పేరు ముద్రించిన పాఠ్య, నోటు పుస్తకాలు విక్రయిస్తున్నాయి.

వేలల్లో ధరలు

ప్రైవేట్ పాఠశాలల్లో చదివే పిల్లలు తప్పనిసరిగా తమ పాఠశాలల్లోనే విక్రయించే పుస్తకాలు కొనుగోలు చేయాలని సూచిస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు మారు మాట్లాడకుండా అక్కడే కొనుగోలు చేస్తున్నారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు మార్కెట్‌లో ఎక్కడా లభించని పాఠ్య పుస్తకాలనే విక్రయిస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు చేసేది లేక వారు చెప్పిన ధరకే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ఇదే అదనుగా ఎల్‌కేజీ, యూకేజీ తరగతులకు సైతం వేల రూపాయలు తీసుకుని పాఠ్య పుస్తకాలు అంటగడుతున్నారు. అవసరమున్నా లేకున్నా టై, బెల్టు, ఐడెంటిటీ కార్డు, డైరీల పేరిట అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు.

అడిగేవారు లేరని..

ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీ విక్రయాలతోపాటు ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తున్నారు. అధిక ఫీజులకు తోడు అడ్మిషన్‌ఫీజు కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. ఈ విషయం బహిరంగ రహస్యమే అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదుకు వెనుకాడుతుండడంతో ఇదే అలుసుగా భావిస్తున్న యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల వ్యాపారం చేస్తున్నాయి. ఏటా విద్యార్థి సంఘాలు ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాల విక్రయం, అధిక ఫీజుల వసూలుపై ఆందోళన చేపడుతున్నా పూర్తిస్థాయిలో సమస్య పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనలు పాటించేలా చూడాలని విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పుస్తకాలు విక్రయిస్తే సీజ్ చేయాలి..

ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీ విక్రయిస్తున్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నారు. నిబంధనలు పాటించకుండా పుస్తకాలు విక్రయిస్తే చర్య తీసుకోవాలి.

– గంగాప్రసాద్, ఏబీవీపీ నాయకుడు, భైంసా

నిబంధనలు పాటించాలి

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలి. విద్యార్థి సంఘాల ఫి ర్యాదుతో పట్టణంలోని మూడు పాఠశాలల్లో తనిఖీలు చేపట్టాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పుస్తకాల గదులను సీజ్ చేశాం. నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకుంటాం. – సుభాష్, ఎంఈవో, భైంసా

కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ



కలెక్టర్‌కు బాసర ప్రసాదంఅందిస్తున్న ఈవో..



కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్పీ, డీఎస్పీ..



శుభాకాంక్షలు తెలుపుతున్న టీజీవో నాయకులు



శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్జీవో నాయకులు

నిర్మల్‌టౌన్: జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అభిలాష అభినవ్‌కు జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ జానకీషర్మిల గురువారం తేనేటి విందు ఏర్పాటు చేశారు. అంతకుముందు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు. ఈ సందర్భంగా లాఅండ్‌ఆర్డర్, అడ్మినిస్ట్రేషన్, శాంతి భద్రతలపై పోలీస్ ఉన్నతాధికాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా ప్రశాంతంగా ఉంటేనే అభివృద్ధి పథంలో ఉంటుందన్నారు. అందుకు పోలీస్ శాఖకు సహకారాలు అందిస్తామని తెలిపారు.

కలెక్టర్‌ను సత్కరించిన బాసర ఆలయ ఈవో

బాసర: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్‌ను బాసర శ్రీజ్ఞాన సరస్వతి దేవస్థానం ఈవో విజయరామారావు, అర్చక బృందం కలెక్టర్ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ అభిలాష అభినవ్‌ను పట్టువస్త్రాలతో సత్కరించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

గెజిటెడ్ అధికారుల సంఘం..

నిర్మల్‌ఖిల్లా : నూతనంగా బాధ్యతలు చేపట్టిన నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్‌ను గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా నాయకులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి అధికారుల సంఘం తరఫున అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తూ, కలిసి నడుస్తామని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీజీవో జిల్లా కార్యదర్శి డాక్టర్ పీజీ.రెడ్డి, కార్యవర్గ సభ్యులు డాక్టర్ సురేశ్, యు.రవికుమార్, జి.సత్యపాల్‌రెడ్డి, సాయినాథ్, విఠల్ తదితరులు ఉన్నారు.

టీఎన్జీవోస్ సభ్యులు..

నిర్మల్‌చైన్‌గేట్: కలెక్టర్‌ను టీఎన్జీవోస్ సంఘం ఆధ్వర్యంలో సభ్యులు గురువారం కలిశారు. పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెలుమల ప్రభాకర్, కార్యదర్శి కూడాల రవికుమార్, అసోసియేట్ అధ్యక్ష శ్రీరామ్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, టి.స్రవంతి, ఎస్.మోహన్‌రెడ్డి, జేబీ. హమ్మద్, ఎన్.శ్రీహరి, గోదావరి, విజయ గౌరీ , వెంకట్ రమణ, డి.రాములు, అరుణ్ కుమార్, వై అశోక్ కుమార్, శ్రీనివాస్, టి. ప్రవీణ్ టి .శ్రీకాంత్ ఈ సుధాకర్ ఉన్నారు.

భైంసాకు సబ్ కలెక్టర్ హోదా..!

• ఉమ్మడి జిల్లాలో మరో మూడు..
• ఉట్నూర్, బెల్లంపల్లి, కాగజ్‌నగర్ కూడా..
• ఆర్డీవో స్థానంలో ఐఏఎస్ అధికారి

భైంసాటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్ కేంద్రాలైన భైంసా, ఉట్నూర్, కాగజ్‌నగర్, బెల్లంపల్లికి సబ్ కలెక్టర్‌స్థాయి హోదా దక్కాయి. ఆర్డీవో స్థానంలో ఐఏఎస్ కేడర్ అధికారిని నియమించాలని నిర్ణయిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఉట్నూర్, భైంసా, కాగజ్‌నగర్, బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్లకు గాను ఇప్పటి వరకు ఆర్డీవో స్థాయి అధికారి ఉండగా, ఇకపై ఐఏఎస్ అధికారి సబ్ కలెక్టర్‌గా ఉండనున్నారు. పరిపాలన ఆవశ్యకతలో భాగంగా రాష్ట్రంలోని 15 రెవెన్యూ డివిజన్లలో ఐఏఎస్ అధికారులను సబ్ కలెక్టర్లుగా నియమించడానికి ప్రభుత్వం సాధారణ పరిపాలన విభాగం ద్వారా జీవో 834ను తేదీ 13.06.2024న జారీ చేసింది.

2016లో డివిజన్‌గా..

భైంసాను 2016లో అప్పటి ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించింది. ఇక్కడి ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో ఐపీఎస్ కేడర్ అధికారిని ఏఎస్పీగా నియమించారు. తాజాగా ఐఏఎస్ కేడర్ అధికారిని సబ్ కలెక్టర్‌గా నియమించేందుకు నిర్ణయించారు. ఆర్డీవోస్థాయి నుంచి సబ్ కలెక్టర్ స్థాయికి హోదా పెరుగనున్న నేపథ్యంలో ప్రజలకు పాలన మరింత చేరువవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. డివిజన్ పరిధిలోని అపరిష్కృత సమస్యలకు సైతం త్వరితగతిన మోక్షం లభించే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం

• డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్



అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌వో

నిర్మల్‌చైన్‌గేట్: నులి పురుగులు లేని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకునేందుకు కలిసికట్టుగా పనిచేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ధన్‌రాజ్ అన్నారు. సోఫీనగర్ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 ఏళ్లలోపు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు (అల్బెండజోల్) వేయించాలన్నారు. ఈ మాత్రలతో కలిగే ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. బహిరంగ మల, మూత్ర విసర్జన మానేయాలని సూచించారు. తద్వారా అన్ని రకాల వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమని, భోజనానికి ముందు విద్యార్థులంతా తప్పకుండా తమ చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్ రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, ప్రిన్సిపాల్ గంగాశంకర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతపై అవగాహన కల్పించాలి

• అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రతీ వస్తువు నాణ్యతపై వినియోగదారులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో భారత నాణ్యత ప్రమాణాల సంస్థ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్) ఆధ్వర్యంలో వస్తువుల నాణ్యత ప్రమాణాలపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. నాణ్య మైన వస్తుసేవలను పొందడం ప్రతీ వినియోగదారుని హక్కు అని పేర్కొన్నారు. ప్రజలకు వస్తువుల నాణ్యత ప్రమాణాలపై, నాణ్యత లోపాలపై ఫిర్యాదులు చేయు అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. భారత నాణ్యత ప్రమాణాల సంస్థ ప్రతీ వస్తువుకు నిర్దిష్టమైన నాణ్యత ప్రమాణం నిర్దేశించబడుతుందని తెలిపారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ వారు ఉత్పత్తిదారులకు సర్టిఫికెట్లు మంజూరు చేయడం ద్వారా ప్రజలకు నాణ్యమైన వస్తువులు అందుతాయన్నారు. ఐఎస్ఐ హాల్ మార్క్, ఇతర రకాలైన సర్టిఫికెట్లను ఈ సంస్థ జారీ చేస్తుందని తెలిపారు. వీటిపై అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పాఠశాలల్లో 8వ తరగతి నుంచి స్టాండర్డ్ క్లబ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ డిప్యూటీ డైరెక్టర్ కెవిన్, స్టాండర్డ్ ప్రమోషన్ ఆఫీసర్ అభిసాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు గతితప్పాయి

• బీజేఎల్పీ నేత 'ఏలేటి'



నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ఎస్పీగా జానకీషర్మిల వచ్చిన తర్వాత శాంతి భద్రతలు క్షీణించాయని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. లక్ష్మణచాంద మండల కేంద్రంలో ఇటీవల జరిగిన ఓ సంఘటనలో జైలుకు వెళ్లిన యువకులను స్థానిక సబ్ జైల్‌లో గురువారం పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ పోలీసులు కేవలం హిందువులపై కక్షపూరితంగా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతి భద్రతలను కాపాడాల్సిన జిల్లా పోలీస్ అధికారి ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. ఎస్పీ తీరుపై కేంద్ర హోం శాఖ మంత్రి, డీజీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు.

విద్యార్థులు పాజిటివ్‌గా ఆలోచించాలి



మాట్లాడుతున్న ప్రదీప్



హాజరైన విద్యార్థులు

• ప్రముఖ సినీ నటుడు, మోటివేటర్ ప్రదీప్

నిర్మల్ రూరల్: విద్యార్థులు పాజిటివ్‌గా ఆలోచించాలని ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు, మోటివేటర్ ప్రదీప్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్కే కన్వెన్షన్ హాల్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు గురువారం మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు ఇష్టంతో చదవాలన్నారు. సంకల్పం ఉంటే సాధించలేనిది లేదని పేర్కొన్నారు. వివిధ ఉదాహరణలతో విద్యార్థులను ఉత్తేజపరిచారు. ఇతరులతో పోల్చుకోవద్దని సూచించారు. ఉపాధ్యాయులు కాలంతోపాటు అప్‌డేట్ కావాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులను అన్నిరంగాలలో తీర్చిదిద్దాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతోపాటు మనం కూడా అభివృద్ధి చెందాలన్నారు. ట్రస్మా రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఎస్ఎన్.రెడ్డి, అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, జనరల్ సెక్రెటరీ గంగన్న, కోశాధికారి కొమ్ము వినోద్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు చంద్రగౌడ్, ప్రధాన కార్యదర్శి పద్మనాభగౌడ్, కోశాధికారి శ్రీనివాస్, పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలి

• ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ చంద్రగిరి శివకుమార్



మాట్లాడుతున్న శివకుమార్

నిర్మల్ రూరల్: జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని ఏబీవీపీ హిందూ విభాగ్ కన్వీనర్ చంద్రగిరి శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం మాట్లాడుతూ.. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేసి, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరిచి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కోరారు. ఇందులో జిల్లా ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ దుర్గాప్రసాద్, సన్నీ, దినేష్, మహేష్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం దృష్టికి ట్రిపుల్‌ఐటీ సమస్యలు



ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తూ..

బాసర: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టీచర్ ఎమ్మెల్సీ కూర రఘూత్తమ్‌రెడ్డి ఆధ్వర్యంలో బాసర ఆర్జీయూకేటీ(ట్రిపుల్‌ఐటీ) కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు శ్రీశైలం గురువారం కలిశారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని, పీఆర్సీని యూజీసీ 7వ వేతన ఒప్పందం ప్రకారం చెల్లించాలని కోరారు. సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా, బుధవారం ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కూడా కలిశారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలపై వినతిపత్రం అందించారు. పరిష్కారానికి ఉప ముఖ్యమంత్రి కూడా హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పరశురాం, అధ్యాపకులు పాల్గొన్నారు.

29న ఎంపీ అభ్యర్థుల ఎన్నికల వ్యయ పరిశీలన

కైలాస్‌నగర్: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసిన అభ్యర్థుల తుది వ్యయ పరిశీలన సమావేశం ఈ నెల 29న కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు పార్లమెంట్ ఎన్నికల నోడల్ అధికారి, డీసీవో బి.మోహన్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుల ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీ చేసిన అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లు ఎన్నికల ఖర్చులకు సంబంధించిన రశీదులు, ఓచర్లను సమర్పించి ఖర్చు వివరాలు పరిశీలించుకోవాలన్నారు. రశీదులతో పాటు ఓ అఫిడవిట్ నోటరీ చేయించుకుని రావాలని సూచించారు.

బాసరలో పండ్ల విక్రయానికి వేలం



టెండర్ నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

బాసర:శ్రీజ్ఞాన సరస్వతి దేవస్థానంలో 2024–25 సంవత్సరంలో పండ్ల విక్రయ హక్కుల కోసం సీల్డ్, బహిరంగ వేలం గురువారం నిర్వహించారు. టి.రాజేశ్‌గౌడ్ రూ.12 లక్షలకు హక్కులను దక్కించుకున్నట్లు ఈవో విజయరామారావు తెలిపారు. గతేడాది ఇదే వ్యాపారి పండ్ల వ్యాపార హక్కులను రూ. 6.80 లక్షలకు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. ఈసారి రూ.5.20 లక్షలు అదనంగా చెల్లించి హక్కులు దక్కించుకున్నట్లు ఈవో పేర్కొన్నారు.

నిషేధిత గుట్కా పట్టివేత

ఇచ్చోడ: మండల కేంద్రంలోని శివాజీ చౌక్‌లో గురువారం మధ్యాహ్నం నిషేధిత గుట్కా విక్రయిస్తున్న సయ్యద్ వకీని అరెస్టు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. అలాగే అతడి వద్ద నుంచి రూ.3,960 విలువ గల గుట్కా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుట్కా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

నేరడిగొండ: ప్రభుత్వం నిషేధించిన గుట్కాను నిర్మల్ నుంచి నేరడిగొండకు తీసుకువచ్చి అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలి పారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన అత్తర్ అహ్మద్ ఫారూఖీ నేరడిగొండలో అమ్మడానికి తీసుకువచ్చిన గుట్కాను స్వాధీనం చేసుకొని ఆయనపై కేసు న మోదు చేశారు. పట్టుబడ్డ గుట్కా విలువ రూ.6,260 ఉంటుందని తెలిపారు.

జీవన 'యోగ'ం

ఐదేళ్లప్రాయం నుంచే...



నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రంలోని వెంకటాద్రిపేట్‌కు చెందిన ద్యావరశెట్టి చైతన్య తన తండ్రి ప్రభాకర్ చేస్తున్న యోగాసనాలను చూస్తూ పెరిగింది. ప్రభాకర్ నిజామాబాద్‌లో యోగాచార్యులుగా గుర్తింపు పొందారు. ఐదేళ్లకే చైతన్య ఆసనాలు వేయడం ఆరంభించింది. యోగ విద్యలో పట్టు సాధించడమే కాకుండా పట్టా కూడా పొందేందుకు 2008లో నాసిక్‌లోని యశ్వంత్‌రావు చౌహాన్ యూనివర్సిటీ నుంచి డిప్లొమా ఇన్ యోగా పూర్తిచేసింది. భర్త ద్యావరశెట్టి వేణుగోపాల్ సహకారంతో ప్రస్తుతం యోగాసాధన కొనసాగిస్తోంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ పతకాలనూ సాధించింది. మాజీ ఎంపీ మధుయాష్కీ చేతుల మీదుగా ఉత్తమ యోగా ప్రదర్శకురాలిగా అవార్డునూ పొందారు.

ఉచితం.. సమాజ'హితం'...



నిర్మల్‌ఖిల్లా: 2006 నుంచి యోగా సాధన చేస్తున్నాను.. గతంలో ఆదిలాబాద్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో అనుకోకుండా జరిగిన ప్రమాదంలో తలలో రక్తం గడ్డ కట్టిందని డాక్టర్లు చెప్పారు. అప్పుడు రాందేవ్ బాబా స్ఫూర్తితో యోగా అలవాటు చేసుకున్నాను. ఆసనాలు, ప్రాణాయామ, సూర్య నమస్కారాలు ప్రతీరోజు రెండు గంటలు చేస్తున్నాను. అనంతరం గడ్డకట్టిన రక్తం క్రమంగా సాధారణ స్థితికి వచ్చిందని డాక్టర్లు తెలిపారు. అప్పటి నుండి మరింత ఉత్సాహంగా క్రమం తప్పకుండా యోగా చేస్తున్నాను. నేను చేయడమే కాకుండా నా వద్దకు వచ్చే మరో వంద మందికి ఉచితంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌లోని వశిష్ట యోగా సంఘటన్‌లో ఉదయం శిక్షణ ఇస్తున్నాను. – **జంగిలి బాలాజీ యాదవ్, యోగా శిక్షకులు, నిర్మల్**



యోగా ఆసనాలు వేయిస్తున్న శిక్షకుడు తిరుపతిరెడ్డి

- నిత్య సాధనతో ఆరోగ్యం
- నేడు ప్రపంచ యోగా దినోత్సవం

ఆదిలాబాద్/మంచిర్యాలటౌన్/నిర్మల్‌ఖిల్లా: భారతీయ సనాతన సంస్కృతికి ఎంతో విశిష్టత ఉంది. యోగ భారతదేశంలో పుట్టి నేడు ప్రపంచదేశాల్లో కూడా వేగంగా విస్తరించింది. ప్రతి ఒక్కరూ వ్యాయామంలో యోగనే ఆదర్శంగా తీసుకుంటున్నారంటే అదీమన భారతదేశ గొప్పతనం. దీన్ని ప్రపంచ దేశాలు గుర్తించడంతో ఐక్యరాజ్య సమితి 2015 నుంచి జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది. జూన్ 21న సూర్యుడు భూమధ్య రేఖకు దూరంగా వెళ్తాడు. ఆ రోజున దినంలో సమయం కొద్దిగా ఎక్కువగా ఉంటుంది. ఇదే రోజును ప్రపంచ యోగా దినోత్సవంగా నిర్ణయించడానికి ఒక కారణంగా చెప్తారు. మనసును నిగ్రహపరచడం, శారీరక, మానసిక ఆరోగ్యంపై పట్టు సాధించాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ యోగాకు ప్రాధాన్యత ఇస్తున్నారు. నేడు ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఆసనాలు..

వివిధ రకాల ఆసనాల ద్వారా పలు ప్రయోజనాలు ఉన్నాయి. ప్రాణాయామం, వృక్షాసనం, వీరభద్రాసనం, పశ్చిమోత్తానసనము, గోముఖాసనము, శీర్షాసనం, పూర్ణ శలభాసనం, చక్రాసనం ఆసనాల ద్వారా రక్తశుద్ధి, నరాలకు బలం చేకూర్చడం, పొట్ట తగ్గడం, బరువు తగ్గడం వంటి ప్రయోజనాలు ఉన్నాయని శిక్షకులు సూచిస్తున్నారు.



యోగా నేర్పిస్తున్న సంధ్య బెదోద్కర్



యోగా శిక్షణ ఇస్తున్న శిక్షకుడు సంతోష్

దినచర్యలో ఒక భాగం చేసుకోవాలి



మన దినచర్యలో యోగాను ఒక భాగం చేసుకోవాలి. ఏదో ఒక ఆరోగ్య సమస్యతో ప్రతి ఒక్కరూ బాధపడుతున్నారు. ప్రతిరోజు యోగా చేయడంతో ఆరోగ్యంగా ఉంటారు. ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులు దరిచేరవు. ఏ వ్యాధికి సంబంధించిందైనా పూర్తిగా అదుపులో ఉంచేందుకు, ఆ వ్యాధులను తగ్గించేందుకు యోగ ఉపయోగపడుతుంది. ధ్యానం, ప్రాణామాయం వంటివి ఒత్తిడిని దూరం చేయడంతోపాటు రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరు సునాయాసంగా చేసేందుకు యోగా ఉపయోగపడడంతోపాటు చిన్నారుల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను పెంపొందిస్తుంది. యోగ ఆసనాలను ఇష్టం వచ్చినట్లు వేయకుండా శిక్షకులు చెప్పిన పద్ధతిలో వేయాలి. – **గోనె మణిమాల, యోగ శిక్షకురాలు, మంచిర్యాల**

విస్తృత ప్రయోజనాలు



యోగా సాధన మనిషి జీవితంలో గణనీయమైన మార్పులను తీసుకువస్తుంది. ఇది కేవలం శారీరక వ్యాయామానికి మాత్రమే పరిమితం కాదు. విస్తృత ప్రయోజనాలు ఉంటాయి. నిరంతర సాధనతో ప్రశాంతత చేకూరుతుంది. తనలోని అంతరంగాన్ని చదివే దిశగా మనిషిని ప్రేరేపిస్తుంది. చిన్నారులు మొదలుకొని వృద్ధుల వరకు చేయవచ్చు. ముఖ్యంగా నేటి యువత యోగా సాధన అలవర్చుకోవాలి. – **సంధ్య బెదోద్కర్**

పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నా..



నిత్యజీవితంలో పెరిగిన ఒత్తిడితో పాటు ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో శారీరక, మానసిక రుగ్మతలు పెరిగిపోతున్నాయి. రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నా కొన్నిసార్లు దీర్ఘకాలిక వ్యాధులు అదుపు చేసుకోలేని పరిస్థితి. ఈ క్రమంలో వ్యాధుల నియంత్రణకు, మానసిక దృఢత్వం సాధించేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో సాధనతో ప్రతి ఒక్కరిలో ఉత్తేజం నింపుతుంది. శరీరం, మనస్సుపై అదుపు ఏర్పడుతుంది. భారతీయ సంస్కృతి ప్రసాదమైన యోగా పలువురికి నేర్పిస్తుండడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. – **తిరుపతి రెడ్డి, యోగా శిక్షకుడు, పతంజలి యోగ భవన్**

ప్రపంచవ్యాప్తంగా ఆదరణ



యోగాకు దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పెరుగుతుంది. దీనిని ఒక క్రీడగా గుర్తించడంతో ఈ కోర్సులకు డిమాండ్ పెరుగుతుంది. భవిష్యత్తులో ఒలంపిక్ క్రీడల్లో సైతం దీన్ని చేర్చే అవకాశాలు ఉన్నాయి. ఆరోగ్యంతో పాటు ఉపాధి సైతం యోగా ద్వారా సాధ్యమవుతుంది. చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే విధంగా పాఠ్యపుస్తకాల్లో యోగాను చేర్చడం శుభ పరిణామం. అలాగే పాఠశాలల్లో ప్రత్యేకంగా సమయం కేటాయిస్తుండడం దీనికి పెరుగుతున్న మద్దతుకు సంకేతంగా నిలుస్తుంది. యోగాతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. – **సంతోష్, యోగా శిక్షకుడు, ఆదిలాబాద్**

ఏకాగ్రత పెరుగుతుంది..



చెన్నూర్: వేసవి సెలవుల్లో యోగా నేర్చుకున్నా. యోగా క్లాస్‌ల ద్వారా ఏకగ్రత పెరుగుతుంది. గత ఏడాది నుంచి యోగా శిక్షణ పొందుతున్నా. జ్ఞాపక శక్తి పెరిగింది. ఎండకాలంలో సెలవులను యోగా శిక్షణ తరగతులతో గడిపాను. –**బి.రుత్విక్, విద్యార్థి**

ఆసనాలు నేర్చుకున్నా..



చెన్నూర్: మొదట యోగా ఆసనాలు వేయాలంటే కష్టంగా ఉండే. ప్రతీరోజు క్లాస్‌లకు వచ్చాను. ప్రస్తుతం నాకు అన్ని రకాల యోగా ఆసనాలు వేయడం వచ్చు. ఎలాంటి ఫీజు తీసుకోకుండా గత నాలుగేళ్ల నుంచి యోగా శిక్షణ ఇస్తున్నారు. –**గంగుల జస్విత, విద్యార్థిని, చెన్నూర్**

పది మందికి నేర్పించాలని..



చెన్నూర్: నేను నేర్చుకున్న యోగా వృథా కావద్దనే ఉద్దేశంతో పది మందికి నేర్పిస్తున్నా. నాలుగేళ్ల నుంచి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నా. ప్రస్తుతం ఉదయం ఒక బ్యాచ్, సాయంత్రం ఒక బ్యాచ్ చొప్పున వస్తున్నారు. ప్రతి ఒక్కరూ యోగా అభ్యసించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. –**మంచాల పద్మజ, యోగా శిక్షకురాలు, చెన్నూర్**

దుబాయ్‌లో నిర్మల్ జిల్లా వాసి మిస్సింగ్

- ఉపాధి నిమిత్తం వెళ్లిన రెండు రోజులకే..
- అచూకీ కోసం ప్రయత్నాలు చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు



కస్తూరి చందు(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: గల్ఫ్ దేశమైన దుబాయ్‌కి ఉపాధి నిమిత్తం వెళ్లిన నిర్మల్ జిల్లావాసి అక్కడ అదృశ్యమైనట్లు ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల తెలిపారు. నిర్మల్ రూరల్ మండలం చిట్యాల గ్రామానికి చెందిన కస్తూరి శేఖర్ కుమారుడు కస్తూరి చందు(19) ఈ నెల 14న ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడికి చేరుకున్న చందు టాక్సీలో ఏజెన్సీ వారు కేటాయించిన గదిలో ఉంచగా మరుసటిరోజే అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కాగా అతని సెల్‌ఫోన్ ఆధారంగా ఆచూకీ కనుక్కొని మళ్లీ అతనిని తీసుకువచ్చారు. ఇదే నెల 16వ తేదీన అర్ధరాత్రి అందరూ పడుకున్న తర్వాత తన గది నుంచి మళ్లీ వెళ్లిపోయాడు. ఆచూకీ తెలియకపోవడంతో మిస్సింగ్ కేసును నమోదు చేయించారు. ఈ విషయం స్వగ్రామంలో ఉన్న కుటుంబ సభ్యులకు తెలియగా వారు ప్రవాసీ మిత్ర లేబర్ లేబర్ యూనియన్ వాలంటీర్ ఏనుగు సాయి రాజుకు సమాచారం అందించారు. అనంతరం లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పండ్లను కలిసి పూర్తి వివరాలు తెలిపారు. దుబాయ్ ఎంబసీకి పూర్తి వివరాలతో కూడిన సమాచారాన్ని పంపించారు. ఉపాధి నిమిత్తం విజిట్ వీసాపై వెళ్లిన యువకుడు అదృశ్యమైనట్లు అక్కడి సామాజిక మాధ్యమాల్లో, స్థానిక గల్ఫ్ కార్మికుల సంఘాల నాయకులకు సమాచారం అందించి ఆచూకీ కనుగొనే పనిలో ఉన్నట్లు పేర్కొన్నారు.

నిర్మల్‌లో వీధి కుక్కల బీభత్సం

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణంలో వీధి కుక్కలు బీభత్సం సృష్టించాయి. రెండు సంవత్సరాల బాలుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికుల వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గాజులపేట్ ప్రాంతంలో నివాసం ఉండే ఆటో డ్రైవర్ షేక్ అజ్గర్ కుమారుడు షేక్ రోహన్ అనే బాలుడు బుధవారం రాత్రి ఇంటి వద్ద ఆడుకుంటుండగా కుక్కల గుంపు ఒక్కసారిగా దాడిచేశాయి. బాలుడు కేకలు విన్న చుట్టుపక్కల వారు కుక్కలను తరిమేందుకు ప్రయత్నం చేయగా, కుక్కలు వారిపై తిరగబడ్డాయి. దీంతో రాళ్లు, కర్రలతో కుక్కలను తరిమేశారు. వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణంలో నిత్యం ఇలాంటి సంఘటనలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపించారు.



బాలుడిని తీవ్రంగా గాయపర్చిన కుక్కలు

మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు..

జిల్లా కేంద్రంలోని గాజులపేట్‌లో బుధవారం రాత్రి జరిగిన ఘటనపై కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజుకు గురువారం ఫిర్యాదు చేశారు. కుక్కల బెడద నివారించాలని కోరారు. కుక్కల భయంతో బయటకు వెళ్లడానికి కూడా భయపడుతున్నామని పేర్కొన్నారు. ఇందులో ఎంఐఎం నాయకులు మహమ్మద్ ఇర్ఫాన్, ఆమన్ తదితరులు పాల్గొన్నారు.

పాటకు ప్రాణం పల్లవి అయితే..

- సంగీతమే సమస్తంగా భావిస్తూ..
- స్వరం, గానంతో అలరిస్తున్న కళాకారులు
- నేడు ప్రపంచ సంగీత దినోత్సవం

నిర్మల్‌ఖిల్లా: సంగీతం ఈ మూడక్షరాల పదానికి ఉన్న శక్తి మాటల్లో వర్ణించలేనిది. రాగం.. తానం.. పల్లవి ఈ మూడు సంగీత సరస్వతికి ప్రాణాధారాలు, సరిగమపదనిసలే సప్తస్వరాలై సంగీత ప్రపంచానికి మూలాధారాలుగా నిలుస్తున్నాయి. కాలాన్ని సైతం మరపించి.. మానసిక ఆనందంతోపాటు ఆరోగ్యాన్ని ప్రసాదించే శక్తి సంగీతానికి మాత్రమే సొంతమని అనడంలో అతిశయోక్తి లేదు. మనిషిని కదిలించి.. కరిగించే మహత్తర శక్తి సంగీతానిది. జూన్ 21న అంతర్జాతీయ సంగీత దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...

1982 నుంచి ప్రత్యేక దినోత్సవం..

మొట్టమొదట మ్యూజిక్ డే ఫ్రాన్స్‌లో ప్రారంభమైంది. దీనిని 1982వ జూన్ 21 నుంచి కొనసాగిస్తూ వస్తున్నారు. ఆ రోజును 'మ్యూజిక్ డే లేదా అంతర్జాతీయ సంగీత దినోత్సవం' గా ప్రపంచ దేశాలు జరుపుకుంటున్నాయి.

ప్రాణం పోస్తున్నారు...

జానపద సంగీతం, స్వరకల్పన ద్వారా పాటల్ని, సంగీతాన్ని వెలికి తీయడానికి శ్రమిస్తున్నారు జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌కు చెందిన జానపద గాయకుడు, కళాకారుడు చెనిగారపు నాగరాజు తన మిత్రుడైన నర్సాపూర్–జి మండల కేంద్రానికి చెందిన స్పెషల్ బ్రాంచ్ పోలీస్ కానిస్టేబుల్ కొత్త కొండ రంజిత్‌కుమార్‌తో కలిసి 'పాటే మా ప్రాణం' అనే సంగీత స్వరకల్పన వేదికను ఏర్పాటు చేశారు. దీని ద్వారా సంగీతంపై మక్కువ ఉన్న వారిని ప్రోత్సహిస్తూ, వారిలోని నైపుణ్యాలను వెలికి తీయాలన్నా ప్రధాన లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటి వరకు దాదాపు 100 మంది కళాకారులను వారిలోని సంగీత గాత్ర నైపుణ్యాలను వెలికి తీసి బాహ్య ప్రపంచానికి పరిచయం చేశారు.



పాట పాడుతున్న రాజుల నాగరాజు

స్వీయసంగీత సాధనతో ఉపాధి..

నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ కాలనీకి చెందిన 'రాజుల నాగరాజు'. దిగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన నాగరాజు సరదాగా బాల్యంలో పాటలు పాడేవాడు. ఉపాధి కోసం ఎన్నో దారులు వెతికాడు. తనకున్న అభిరుచి పాటలు పాడడంలో సాధన చేశాడు. యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల్లో సంగీతానికి సంబంధించిన ప్రాథమిక మెలకువలు ఇంటివద్దే నేర్చుకున్నాడు. ఈవెంట్లలో ప్రధాన గాయకుడిగా పాడడం ద్వారా శక్తి మేర డబ్బులు సంపాదించడం మొదలుపెట్టాడు. క్రమంగా పాటల పాడే అవకాశాలు, లైవ్‌షోలు పెరగడంతో తానే సొంతంగా ఈవెంట్స్ నిర్వాహకుడిగా ఎదిగాడు. ఆధ్యాత్మిక పాటలైన అయ్యప్ప, శ్రీరాముడి పాటలు కూడా నాగరాజు గొంతులో వినసొంపుగా పలుకుతుండడంతో నిర్మల్ నుంచి హైదరాబాద్ వరకు పలు ప్రాంతాలలో ఇతని ఆర్కెస్ట్రా బృందం ఈవెంట్లు, వివిధ చానెల్లలో షోలు విజయవంతంగా కొనసాగుతున్నాయి.



పురస్కారం స్వీకరిస్తున్న నాగరాజు(ఫైల్)

ప్రయోగాత్మకంగా బోధన సాగాలి

- ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్

ఆదిలాబాద్‌రూరల్: ప్రయోగాత్మక బోధనతోనే విద్యార్థులు సులువుగా అర్థం చేసుకొని ఎప్పటికీ గుర్తుంచుకుంటారని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కొలాం ఆశ్రమ పాఠశాలలో కొనసాగుతున్న ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆంగ్ల మాధ్యమంలోనే బోధన చేయాల్సి ఉన్నందున విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే పద్ధతులను ఎంచుకోవాలన్నారు. ప్రతి నెల ఒక రోజు శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. పరిసరాలు, వంటగది, స్టోర్ రూం, తదితర వాటిని పరిశీలించారు. హాజరుపట్టికలను పరిశీలించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఇందులో శిక్షణ తరగతుల ప్రత్యేకాధికారి పార్థసారథి, ప్రధానోపాధ్యాయులు నారాయణ, కృష్ణవేణి, తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్

అదృశ్యమైన బాలుడు.. శవమై లభ్యం

- గోపాయిచెరువులో తేలిన మృతదేహం
- ఉట్నూర్ మండలంలో ఘటన



సాయికుమార్ (ఫైల్)



గోపాయిచెరువులో తేలిన సాయికుమార్ మృతదేహం

ఉట్నూర్‌రూరల్: నెల 18 న అదృశ్యమైన బాలుడు మండల కేంద్రంలోని గోపాయి చెరువులో అనుమానాస్పదంగా శవమై తే లిన ఘటన మండలంలో కలకలం రేపింది. ఉట్నూ ర్ ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాత ఉట్నూర్ ఎస్‌ఆర్‌నగర్ కాలనీకి చెందిన రాథోడ్ గోపాల్–కల్పన దంపతులకు నలుగురు సంతానం. వీరి రెండో కుమారుడైన రాథోడ్ సాయికుమార్ (9) ఈ నెల 18వ తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గోపాయిచెరువులో తేలిన మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి సాయికుమార్‌దిగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన వాహనం

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని విద్యుత్ స్తంభాన్ని గురువారం ఓ వాహనం ఢీకొట్టింది. తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఆస్పత్రి ఆవరణలో ఉన్న మెడిసిన్ స్టోర్ ప్రాంతంలోకి పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన పెద్ద వాహనంలో ఔషధాలు తీసుకొచ్చారు. ఈ క్రమంలో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం వంగిపోవడంతో విద్యుత్ తీగలు కిందకు వచ్చాయి. ఈ ఘటన జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన కారణంగా రోజంతా ఆస్పత్రిలో అంధకారం అలుముకుంది. డయాలసిస్ సెంటర్‌కు విద్యుత్ సరఫరా చేసే బాక్సు పేలి తీవ్ర నష్టం జరిగింది. ఈ విషయమై సూపరింటెండెంట్ వంశీ మాధవ్‌ను వివరణ కోరగా, వాహనం ఢీకొనడంతో జరిగిన నష్టాన్ని వాహనదారులే భరించి మరమ్మతు చేయిస్తున్నారని తెలిపారు. రాత్రి వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరుగుతుందని పేర్కొన్నారు.



స్తంభాన్ని పరిశీలిస్తున్న విద్యుత్ సిబ్బంది

క్లుప్తంగా

సమాఖ్య అధ్యక్షురాలు గంగామణికి సన్మానం


గంగామణిని సన్మానిస్తున్న రాజేశ్వర్

లక్ష్మణచాంద: జిల్లా సమాఖ్య బ్యాంక్ లింకేజీ రుణాల మంజూరులో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలువగా జిల్లా, మండల సమాఖ్య అధ్యక్షురాలు గంగామణి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రశంసాపత్రం అందుకుంది. గురువారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు రాజేశ్వర్ ఆమెను సన్మానించారు. ఏపీవో వాణిశ్రీ, సీసీలు సాయన్న, దినేశ్, గ్రామ సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

ఖానాపూర్: మేడంపల్లి గ్రామంలోని రేండ్ల పోచమ్మ ఆలయ నాలుగో వార్షికోత్సవంలో భాగంగా గురువారం మహిళలు అధికసంఖ్యలో పోచమ్మ బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పోచమ్మకు ఒడిబియ్యం, బోనాలు సమర్పించిన భక్తులు మొక్కు చెల్లించుకున్నారు.

నిబంధనలు పట్టని 'ప్రైవేట్'

ఖానాపూర్: పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు పాటించడంలేదని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి అల్లెపు పీటర్ ఆరోపించారు. ఖానాపూర్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ, యూనిఫాంలు, పుస్తకాలు విక్రయిస్తూ విద్యను వ్యాపారంగా మార్చిన యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు స్వరూప, సురేందర్, గణేశ్, సంగీత ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలోగల డబుల్‌బెడ్రూం కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు గురువారం మున్సిపల్ కమిషనర్ మనోహర్‌ను కలిసి కోరారు. డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, తాగునీటి వసతి కల్పించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కాలనీ అధ్యక్షుడు నంది రామయ్య తదితరులున్నారు.

ఘనంగా యోగా దినోత్సవం


యోగా ఆంగ్ల అక్షరాకృతిలో విద్యార్థులు

ఖానాపూర్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు ఆసనాలు వేశారు. యోగా ఆంగ్ల అక్షరాకృతిలో ప్రదర్శన నిర్వహించారు. హెచ్ఎం నరేందర్‌రెడ్డి, పీడీ ఇమ్రాన్, ఉపాధ్యాయులున్నారు.

యూనిఫాంల పంపిణీ

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు గురువారం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ యూనిఫాంలు పంపిణీ చేశారు. ఏపీఎం అశోక్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీ కాంత్, సీసీ యూసుఫ్, ఉపాధ్యాయులున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కుంటాల: మండలంలోని ఓలా ఉన్నత పాఠశాలకు ఇటీవల బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు సోమేశ్వర్, రవీందర్, గంగాధర్, విజేశ్‌ను గురువారం సన్మానించారు. హెచ్ఎం లక్ష్మణ్, మాజీ కో ఆప్షన్ మెంబర్ హైమద్ పాషా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సుమలత, ఉపాధ్యాయులు, గ్రామస్తులున్నారు.

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కార్యవర్గం

ఖానాపూర్: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ అభిలాష అభినవ్‌ను ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు గురువారం కలిశారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల సందర్శన

కుంటాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎంపీపీ అప్క గజ్జారాం గురువారం గ్రామస్తులతో కలిసి సందర్శించారు. ప్రభుత్వ కళాశాలలోనే విద్యార్థులను చేర్పించాలని కోరారు. ప్రిన్సిపాల్ తుకారాం, నవీన్ తదితరులున్నారు.

వెంకూర్ చెరువు.. సాగునీరు కరువు

- మరమ్మతుకు నోచుకోని అలుగు
- ఆయకట్టు సాగు ప్రశ్నార్థకం
- ఆందోళన చెందుతున్న రైతులు


మరమ్మతుకు నోచుకోని అలుగు

కుంటాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఇసుక వెళ్లకుండా, రైతులకు సాగు నీరందించాలన్న లక్ష్యంతో మండలంలోని ఓలా వాగుపై 2006లో వెంకూర్ గ్రామ శివారులో రూ.కోటి 47లక్షలతో చెరువు నిర్మించారు. 166 ఎకరాల భూమి సేకరించి 1,350 ఎకరాలకు సాగు నీరందించాలని నిర్ణయించారు. చెరువు నిర్మాణం నాసిరకంగా చేపట్టడంతో ఏడాదికే అలుగుకు బుంగ పడింది. దీంతో ఆయకట్టుకు సాగునీరు అందక రైతుల ఆశలు ఆవిరయ్యాయి.

సాగు ప్రశ్నార్థకమే..

మండలంలోని పాత వెంకూర్ సమీపంలో నిర్మించిన చెరువు ద్వారా ఓలా, వెంకూర్, అందాకూర్, విఠాపూర్ గ్రామాల రైతుల భూములకు సాగునీరు అందాల్సి ఉంది. భూగర్భ జలాలు కూడా వృద్ధి చెందాలి. చెరువుకు రెండు తూములు, అలుగు నిర్మించినా కాలువల నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిపివేశారు. నాణ్యత పాటించక పోవడంతో పగుళ్లు తేలాయి. ప్రధాన కట్టపై రెవిట్‌మెంట్, భారీ వర్షాలకు అలుగు కొట్టుకుపోయాయి. మరో రెండు సార్లు అలుగు నిర్మాణానికి నిధులు మంజూరైనా నిర్వహణ సక్రమంగా లేక పనులు నాసిరకంగా చేపట్టారు. మళ్లీ కొట్టుకుపోవడంతో వేసవి కంటే ముందే చెరువులోని నీరు ఖాళీ అవుతోంది. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా ఎన్నో చెరువులను పునరుద్ధరించినా వెంకూర్ చెరువు నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు. చెరువు కింద భారీ వర్షాలకు కోతకు గురైన భూములకు ఇప్పటికీ పరిహారం అందించలేదు.

నెరవేరని లక్ష్యం..

ఈ చెరువు ద్వారా 1,350 ఎకరాలకు సాగునీరు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కానీ.. ఎకరాకు కూడా సాగునీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. తలాపునే చెరువున్నా ప్రయోజనం లేదంటు


పిచ్చి మొక్కలతో నిండిన కాలువ

న్నారు. ఈ వానాకాలం సాగు కూడా ప్రశ్నార్థకంగా మారిందని చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వెంకూర్ చెరువు మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

చెరువున్నా ప్రయోజనం లేదు



చెరువు నిర్మాణం పూర్తయిందని సంతోషపడ్డాం. ఆయకట్టుకు నీరంది పంటలు బాగా పండుతాయని అనుకున్నాం. ప్రస్తుతం చెరువులో నీరు లేక పంటలు పండడం లేదు. చెరువున్నా ప్రయోజనం లేకుండా పోయింది.

– గోవింద్‌రావు, రైతు

నిధులు మంజూరు చేయాలి



వెంకూర్ చెరువు అలుగుకు నిర్మించిన ఏడాదికే బుంగ పడింది. నాసిరకంగా పనులు చేపట్టడంతో మొత్తం కొట్టుకు పోయింది. చెరువు నీరంతా వృథాగా పోతోంది. ఎకరం కూడా సాగవడం లేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే నిధులు మంజూరు చేయాలి.

– గంగాధర్ పటేల్, రైతు

ప్రతిపాదనలు పంపాం

మండలంలోని వెంకూర్ చెరువును ఇటీవల పరిశీలించాం. గత భారీ వర్షాలకు అలుగు కొట్టుకు పోయింది. మరమ్మతుకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే నిర్మాణం చేపట్టి సాగు నీరందేలా చర్యలు తీసుకుంటాం.

– రమేశ్, ఇరిగేషన్ ఏఈ

గ్రామదేవతలకు పూజలు


పూజలు చేస్తున్న గ్రామస్తులు

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామంలో గురువారం గ్రామ దేవతలకు పూజలు చేశారు. పాడి, పంటలు, పిల్లాపాపలను చల్లగా చూడాలని కోరుతూ పోచమ్మ, లక్ష్మీదేవి, మైసమ్మ, మారెమ్మ తదతర గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.

వానలు కురవాలని..


ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

కుంటాల: వానలు కురవాలని మండలంలోని ఓలా గ్రామంలో గురువారం కప్పతల్లి ఆడారు. రోకలి బండకు కప్పను కట్టి, వేపకొమ్మలు ఉంచి డప్పు, వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు, రైతులు రోకలి బండపై ఉన్న కప్పకు నీళ్లపోసి పూజలు చేశారు.

వైద్యశాలలోని సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న మిషన్ కుంటాల సభ్యులు

కుంటాల: మండల కేంద్రంలోని వైద్యశాలలో సమస్యలు పరిష్కరించాలని మిషన్ కుంటాల చైర్మన్ దొనికెన వెంకటేశ్ డిమాండ్ చేశారు. గురువారం కుంటాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైద్యశాలలో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్స్, ఫార్మసిస్ట్ పోస్టులను భర్తీ చేసేలా చూడాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. పోస్టుల భర్తీలో జాప్యం కారణంగా పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారిందని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే నిరసన దీక్ష చేపడతామని హెచ్చరించారు. కమిటీ సభ్యులు బోగ లక్ష్మణ్, కుమ్మరి రమేశ్, అరిగెల శంకర్, బండారి గజేందర్ తదితరులున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు.. చెత్తకుప్పలు


వైన్స్ పక్కన చెత్తకుప్ప

కుభీర్: మండల కేంద్రంలోని వైన్స్ ఎదుట ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త పేరుకుపోతోంది. వైన్స్ ఎదుట భైంసాకు వెళ్లే రెండు వరుసల రోడ్డు ఉండగా మద్యం మత్తులో మందుబాబులు రోడ్డు మీదే పడుకుంటున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను పశువులు తింటూ అస్వస్థతకు గురవుతున్నాయి. సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై గ్రామపంచాయతీ సిబ్బందిని వివరణ కోరగా.. సమస్య తమ దృష్టికి వస్తే జరిమానా విధిస్తామని చెప్పారు.

విత్తనం మొలకెత్తాలని..


ఓలాలో పత్తికి తడి అందిస్తున్న రైతు

కుంటాల: రుతుపవనాలు వచ్చి వారమైనా నేటికీ ఆశించిన రీతిలో వర్షాలు పడలేదు. వరుణుడు కరుణిస్తాడని మృగశిరకార్తెలో ఆయా గ్రామాల రైతులు పత్తి, సోయా విత్తనాలు వేశారు. కానీ.. చినుకు జాడ లేక దిగులు చెందుతున్నారు. మొలక దశలోనే విత్తనం ఎండిపోతుండగా, నీటి సౌకర్యం ఉన్న కొందరు రైతులు ఇలా తడులు అందిస్తున్నారు.

నిధులు మంజూరు

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ శివాలయానికి రూ.2లక్షలు, భైంసా మండలం తిమ్మాపూర్ నుంచి పెంచికల్‌పాడ్ గ్రామం వరకు రోడ్డుపై మొరం వేసేందుకు రూ.2 లక్షల జెడ్పీ నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని నాయకులకు గ్రామస్తులకు గురువారం అందజేశారు. మాజీ సర్పంచులు కొత్తపల్లి బుచ్చన్న, దిగంబర్ పటేల్, మాజీ ఎంపీటీసీ చంద్రకాంత్ తదితరులున్నారు.

చెక్‌పోస్టు వద్ద సీసీ కెమెరాలు

సారంగాపూర్: మండలంలోని తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు గ్రామమైన రాంసింగ్‌తండా, సిర్పెల్లి గ్రామాల్లోని చెక్‌పోస్టు వద్ద స్థానిక ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనిఖీల్లో పారదర్శకత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నర్సరీ పరిశీలన

తానూరు: మండలంలోని మహలింగి గ్రామంలోని నర్సరీని గురువారం ఈజీఎస్ ఏపీవో గంగాధర్ పరిశీలించారు. హరితహారం నాటికి మొక్కలను సిద్ధంగా ఉంచాలని, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించాలని నిర్వాహకులకు సూచించారు.

దరఖాస్తులు అందజేత

ముథోల్ : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రజాపాలన దరఖాస్తులు అందజేయడానికి గురువారం ప్రజలు బారులు తీరారు. ప్రధానంగా గృహజ్యోతి, జీరో విద్యుత్ బిల్లుల కోసం దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నిర్మల్ రూరల్: నిర్మల్ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11గంటలకు జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గజానన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఎస్సైని కలిసిన కాంగ్రెస్ నాయకులు

సారంగాపూర్: నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్‌ను గురువారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీ మండలాధ్యక్షుడు నర్సయ్య, నాయకులు ఓలాత్రి నారాయణరెడ్డి, అబ్దుల్ హాది, విలాస్‌రావు, జగదీశ్, రాంరెడ్డి, భూమన్న, నక్క రాజన్న తదితరులున్నారు.

బాబా ఆలయానికి భక్తుల రద్దీ


మధ్యాహ్న హారతి కార్యక్రమానికి అధికసంఖ్యలో హాజరైన భక్తులు

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం బాబాకు పూజలు నిర్వహించారు. మంగళస్నానం, అలంకరణ కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్న హారతిలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. బాబాను దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

'నులి'పేద్దాం.. నివారిద్దాం


మామడ: ప్రాథమిక పాఠశాలలో..


భైంసాటౌన్: పట్టణంలో..


లోకేశ్వరం: ఉన్నత పాఠశాలలో..


సోన్: సాకేర గ్రామంలో..



నిర్మల్‌టౌన్: పట్టణంలో..


కడెం: కొండుకూర్‌లో చిన్నారులకు మాత్రలు వేస్తున్న సిబ్బంది

- చిన్నారులు, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గురువారం కౌన్సిలర్ మేడారం అపర్ణ ప్రదీప్ ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్, వైద్య సిబ్బంది రాధ, వాణి తదితరులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని పిప్రి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, కస్తూర్బా, జెడ్పీ బాలికల పాఠశాల, స్థానిక అల్ఫోర్స్ పాఠశాలల్లో డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రిజ్ ఘోరీ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కౌన్సిలర్ చందూలాల్, నాయకులు భీంరావు, మాజిద్, ఇమ్రాన్, యూపీహెచ్‌సీ వైద్యురాలు ఫిర్దోస్, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ మతీన్, బస్తీ దవాఖానా ఇన్‌చార్జి కమలేశ్, ఏఎన్ఎంలున్నారు.

మామడ: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని ఎంపీడీవో సుశీల్‌రెడ్డి ప్రారంభించారు. మండలంలో 19 ఏళ్లలోపు 7,139 మందికి మాత్రలు అందించినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేందర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ మధుకర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు ఎంపీపీ అడ్వాల పద్మ నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు రాజేశ్వర్, ఎంపీడీవో రాంప్రసాద్, ఎంపీవో నసీరొద్దీన్, డాక్టర్ ప్రత్యూష, నాయకుడు రమేశ్, ఎస్వో నవిత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ఐదోవార్డు పరిధి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పెంబి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్ పరిమి లత, డాక్టర్ శివ, నాయకులు అమానుల్లాఖాన్, షబ్బీర్‌పాషా, పీహెచ్ఎన్ విమల, ఏఎన్ఎం ఉమారాణి, సిబ్బంది నారాయణ, శ్రీనివాస్, తదితరులున్నారు.

బాసర: మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారి ఆకాశ్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో చిన్నారులకు డాక్టర్ శృతిరెడ్డి ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మి విశారద, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కడెం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొండుకూర్, లింగాపూర్ తదితర గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కడెం పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ గోపాల్, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ గంగామణి, ఆశ కార్యకర్త దేవిక తదితరులున్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని కేజీబీవీ, ఉన్నత పాఠశాల విద్యార్థులకు లోకేశ్వరం పీహెచ్‌సీ డాక్టర్ తేజస్విని నులిపురుగు నివారణ మాత్రలు వేశారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ అనసూయ, వైద్య సిబ్బంది భోజన్న, మరియా, ఆశ కార్యకర్త ఆనంద ఉన్నారు.


ఖానాపూర్: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..


బాసర: మండల కేంద్రంలో..


కుంటాల: మండల కేంద్రంలో..


లక్ష్మణచాంద: కేజీబీవీలో..

సోన్: మండలంలోని ఆయా గ్రామాల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి గోవింద్, ఎంపీపీ మానసరెడ్డి, న్యూవెల్మల్ పీహెచ్‌సీ డాక్టర్ సమత, ఎంపీడీవో సురేశ్, ఎంపీవో కలీల్ హైమద్, పంచాయతీ కార్యదర్శి ప్రియాంకరెడ్డి తదితరులున్నారు.

సారంగాపూర్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, చిన్నారులకు వైద్యసిబ్బంది నట్టల నివారణ మందు వేశారు. శుక్రవారం కూడా వేయనున్నట్లు వైద్యాధికారి వేదవ్యాస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


ప్రమాదంలో గాయపడ్డ నర్సయ్య

ఖానాపూర్: పట్టణంలోని కుమురం భీం చౌరస్తా సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బ్రహ్మంగారి ఆలయం వద్ద రజనీశ్ అనే వ్యక్తి తన కారును నిర్లక్ష్యం, అజాగ్రత్తగా నడిపి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై నిర్మల్ వైపు వెళ్తున్న అగుట్ల నర్సయ్యను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బాధితుడి కాలు విరగడంతోపాటు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నిర్మల్‌కు తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.